

ఆయకట్టు తడిసేనా?

- నిరాశాజనకంగా శ్రీరాంసాగర్
- నత్తనడకన 'సాగు' • ముదురుతున్న వరి నార్లు
- ఎస్సారెస్పీలో 40 టీఎంసీలు నిండితే నీరు వదిలే అవకాశం

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల కల్పత రువుగా పేరొందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీరు లేక వెలవెల బోతోంది. దీంతో ప్రాజెక్టు పరిదిలోని రైతులు వానాకాలం సీజన్ లో ఆయకట్టుకు నీరు అందుతుందా...లేదా అన్న ఆందోళనకు గురవుతు న్నారు. ప్రస్తుత సీజన్‌లో జూలై మద్య మాసం దాటినప్పటికీ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి చేరలేదు. గరిష్టంగా 5 వేల నుంచి 9 వేల క్యూసెక్కుల వరకు మాత్రమే వస్తోంది. ప్రాజెక్టులో ప్రస్తు తం 14.450 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు కాగా మరో 76 టీఎంసీలు నీరు వస్తేనే ప్రాజెక్టు నిండు కుండలా మారుతుంది. ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టులు సైతం ఖాళీగా ఉండడంతో ఆయకట్టు రైతులల్లో ఆందోళన తీవ్రమవుతోం ది. గత యేడాది జూలై రెండో వారం నుంచే వరదలు ప్రారంభమ య్యా యి. జూలై చివరి నాటికి ప్రాజెక్టు నిండు కుండలా మారింది. కానీ ఈ యేడాది ఆశించిన స్థాయిలో వరద కూడా రాలేదు. ఎగువన ప్రాజెక్టులు ఖాళీ ఉండడంతో ఇప్పటికిప్పుడు ఎస్ఆర్ఎస్‌పీకి వరదలు వచ్చే అవకాశా లు లేవన్న అభిప్రాయాలు సంబందిత వర్గాల్లో వ్యక్తం అవుతోంది. వరుణు డు కరుణిస్తే రెండు, మూడు రోజుల్లో ప్రాజెక్టు నిండుకుండలా మారిన సందర్భాలు సైతం ఉన్నాయి. అంతే కాకుండా సెప్టెంబర్ వరకు వరదలు రాకుండా కేవలం ఒక్క పంటకే సాగు నీరు సరఫరా చేసిన అనుభవాలు సైతం ఉన్నాయి.

● జిల్లాలో సాగునీటికి పెద్దదిక్కుగా...

జిల్లాలో రెండు, మూడు మినహా దాదాపుగా అన్ని మండలాల్లో శ్రీరాం సాగర్ కాకతీయ కాలువ ఆయకట్టు పరిధిలో ఉంది. జిల్లాలోని ఇబ్రహీం పట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల వంటి మండలాలకు ఎస్ఆర్ఎస్‌పీ వరద కాలువ ద్వారా సాగు నీరు అందుతోంది. జిల్లా రైతాంగానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరప్రదాయినిగా ఉంది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కింద జగిత్యాల జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1.60 లక్షలు, ఆదిలాబాద్‌లో 1.45 లక్షలు, కరీంనగర్ 6.72 లక్షలు, వరంగల్ 4.71 లక్షలు, ఖమ్మం 1.28 లక్షలు, నల్లగొండ 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదిలా ఉండగా జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో వరి దాదాపు 3 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 2.90 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఎస్ఆర్ఎస్‌పీ నుంచి నీటి విడుదల ఉంటుందో ఉండదో తెలియకపోవడంతో నారు పోసి పక్షం రోజులు గడుస్తున్నా నాట్లు వేయడానికి రైతులు సాహసించడం లేదు. దీంతో నార్లు ముదిరిపోతాయనే ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో సాగు ఆలస్యంగా ప్రారంభమైంది. వ్యవసాయ బావులు, అక్కడక్కడ చెరువులు, కుంటల్లో గల నీటి ఆధారంగా సాగు చేస్తున్నారు.

● జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రెం డు మండలాల్లో లోటు వర్షాపాతం, ఎనిమిది మండలాల్లో అధిక వర్షపా తం, పది మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు అయింది. ధర్మపు రి, బుగ్గారం మండలాల్లో లోటు వర్షపాతం చోటుచేసుకుంది. మల్లాపూర్, సారంగాపూర్, రాయికల్, మేడిపల్లి, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి మం డలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం, బీర్‌పూర్, జగిత్యాల రూరల్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, గొల్లపల్లి, వెల్గటూరు, ఎండపల్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

● నిరాశాజనకంగా నీరు...

ప్రస్తుత సీజన్‌లో వర్షాలు ఆలస్యంగా రావడం, ఎగువ ప్రాంతంలో వ ర్షాలు సకాలంలో కురవకపోవడంతో ప్రాజెక్టులో నీరు నిరాశాజనకంగా ఉంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఈనెల ఒకటవ తేదీన ఎత్తారు. దీంతో గోదా వరి ఎగువ ప్రాంతం నుంచి నీరు స్వల్పంగా వస్తోంది. కొద్దికొద్దిగా కురు స్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటి మట్టం కొద్దిగా పెరుగుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో నిల్వ ఉన్న నీటికి తోడు మరో 26 టీఎంసీల నీరు వచ్చి చేరితే ఆయకట్టు వానాకాలం పంటలకు డోఖా లేకుండా పోతోందని రైతులు ఆశతో ఉన్నారు. 40 టీఎంసీల నీరు ఉంటే తాగునీటి అవసరాలు, ఆవిరి రూపంలో పోయే నీటి లెక్కలు కలుపుకొని వానాకాలంలో ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు సరఫరా చేపట్టవచ్చని సం బంధిత అధికార వర్గాలు అంటున్నాయి.

రుణమాఫీ మార్గదర్శకాలు విధిగా పాటించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, జూలై 18 (ఆన్‌లైన్): రైతు రుణ మాఫీ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను విధిగా అధికారులు పాటించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవలే ప్రభుత్వం క్రాఫ్‌లోన్ రుణమాఫీకి సంబంధించి ఆదేశాలు జారీ చేసిందన్నారు. రుణం తీసుకున్న వారికి రుణ మాఫీ వర్తింపచేయాలని, ప్రతి కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులని ప్రభుత్వం జీవో జారీ చేసిందని, సంబంధిత విధి విధానాలు తప్పక పాటించాలని, నిర్లక్ష్యం వహించరాదని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. 367 జీవో ప్రకారం క్రాప్ లోన్ కట్‌ఆఫ్ డేట్ లోపు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ కచ్చితంగా అమలు చేయాలని కోరారు. జడ్పీ డిప్యూటీ సీఈవో రఘు వరన్, ఎల్‌డియం రాంకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వాణి, డీఆర్డీవవో సంపత్‌రావు, వివిధ బ్యాంక్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉంది

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



సీఎం ప్రసంగాన్ని వింటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 18: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గల రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమానికి సంబం ధించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం ఆయన పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులతో కలిసి ఆయన వీక్షించా రు. అనం తరం లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటి వరకు రూ 2 లక్షల రుణాలను ఏకకాలంలో మాఫీ చేసిన దాఖలాలు లేవన్నారు. ఆనాటి బీఆర్ఎస్ కనీసం లక్ష రూపాయల రుణమాఫీ కూడ చేయలేదన్నారు. వచ్చే నెల ఆగస్టు 15 వరకు రైతులకు పూర్తి స్థాయిలో రుణాలను మాఫీ చేస్తామన్నారు. అంతకు ముందు క్యాంపు కార్యాయంల 55 నుంచి 61 వీఆర్ఏలకు చేసిన అన్యాయాన్ని ప్రజా ప్రభుత్వంలో సరి చేసి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుక వెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, ధర్మపురి ఏడీఏ రాంచందర్, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో నరేష్‌కుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్ పాల్గొన్నారు.

జిల్లాలో 39,253 మందికి రుణ మాఫీ

జిల్లా వ్యవసాయ అధికారి వాణి

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణ మాఫీలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 39,253 మంది తొలివిడతలో వర్తింపజేశామని జిల్లా వ్యవసాయ అధికారి వాణి తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడారు. జిల్లాలోని బీర్‌పూర్ మండలంలో 1,970 మంది రైతులకు, బుగ్గారంలో 1,316, ధర్మపురిలో 3,065, ఎండపల్లి 2,184, గొల్లపల్లి 3,150, ఇబ్రహీంపట్నం 1,537, జగిత్యాల 399, జగిత్యాల రూరల్ 2,478, కథలాపూర్ 2,110 మందికి రుణ మాఫీని వర్తింపజేశామన్నారు. కొడిమ్యాల మండలంలో 2,110 మంది రైతులకు, కోరుట్లలో 1,727, మల్లాపూర్‌లో 1,703, మల్యాలలో 2,207, మేడిపల్లిలో 2,210, మెట్‌పల్లిలో 2,063, పెగడపల్లిలో 2,941, రాయికల్‌లో 2,831 మందికి తొలివిడతలో రుణ మాఫీ అయిందన్నారు.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందిస్తాయి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఉత్సవాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జూలై 18: పండుగలు సంస్కృతి సంప్రాదాయాలను పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కలికోటలో జరిగిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి ఆడారు..పాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంప్రాదాయాలకు అనుగుణంగా పల్లెల్లో పండుగలను వైభవంగా నిర్వహిస్తుండడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో కోరుట్ల ఎమ్మెల్యే

మల్యాల, జూలై 18: కోరుట్ల ఎమ్మెల్యే కె.సంజయ్ గురువారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ శాలువతో సత్కరించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

జగిత్యాల, జూలై 18 (ఆన్‌లైన్): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున 9.9 మిల్లీ మీటర్ల వర్షం ప డింది. అత్యధికంగా వెల్గటూరులో 13.1 మిల్లీ మీటర్లు, ఎండపల్లిలో 12.9 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా కొడిమ్యా లలో 7.1 మిల్లీ మీటర్లు, గొల్లపల్లిలో 8.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు రికార్డు నమోదైంది. ఇబ్రహీంపట్నంలో 11.0 మిల్లీ మీటర్లు, రాయికల్, సారంగాపూర్, మెట్‌పల్లి, పెగడపల్లి, మల్యాలలలో 10.8, బీఆర్‌పూర్‌లో 10.7, కోరుట్ల 10. 3, కథలాపూర్ 9.8, మల్లాపూర్ 9.4, ధర్మపురి 9.2, జగిత్యాల రూరల్ 9.1, జగిత్యాల, బీమారం, మేడిపల్లి 8.9, మల్యాల, గొల్లపల్లి 8.7, కొడిమ్యాల 7.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వర్షం వల్ల ఎలాంటి నష్టం జరగలేదు.

రుణమాఫీ అమలు చారిత్రాత్మక నిర్ణయం

జగిత్యాల టౌన్, జూలై 18 : అన్నదాతకు ఏక కాంలో రెండు లక్షల రుణమాఫీ అమలు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని రైతు సంఘం నాయకుడు, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు తురక రాజిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫి చేయడాన్ని హర్షిస్తూ జిల్లా కేంద్రంలోని 10వ వార్డు లింగంపేటలో గురువారం రైతు నాయకుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులు సిరికొండ శ్రీనివాస్, సిరికొండ ప్రవీణ్, తురక రవి, రాజిరెడ్డి, లక్ష్మీరాజం ఉన్నారు.

రైస్‌మిల్లును తనిఖీ చేసిన అధికారులు

రాయికల్, జూలై 18: మండలంలోని మైతాపూర్ గ్రామంలోని శివమణి రైస్‌మిల్లును గురువారం సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు రైస్‌మిల్లులో ఉన్న వడ్లు, బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సిరిసిల్ల సివిల్ సప్లై డీఎం జితేంద్రప్రసాద్, విజిలెన్స్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, డిప్యూటీ తహసీల్దార్ గణేష్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రావు, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

భీమారం, జూలై 18: మండలంలోని మన్నెగూడెం గ్రామంలో కోరుట్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చే శారు. దృష్టి లోపం ఉన్న 50 మందికి కంటి ఆపరేషన్ నిమి త్తం రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఫాస్ట్ రీజన్ ఛైర్మన్ ఆడెపు మధు, కోరుట్ల లయన్స్ క్లబ్ ఛైర్మన్ కుందర మహేందర్, సెక్రటరీ శ్రీగద్దె నరేందర్, జోన్ ఛైర్ పర్సన్, కౌన్సిలర్ ఆడెపు కమల, తాజా మాజీ సర్పంచ్ నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

హరీష్ రావు వెంటనే రాజీనామా చేయాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- రైతు రుణమాఫీపై జగిత్యాలలో సంబరాలు



రాహుల్, రేవంత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్

జగిత్యాల టౌన్, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీష్‌రావు తక్షణమే తన పదవికీ రాజీనామా చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫి చేయడాన్ని హర్షిస్తూ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరా భవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలతో కూడిన ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం తీసుకుని నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు కూడా రైతుల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే రైతు రుణమాఫీ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీనామా పత్రంతో సిద్దంగా ఉండాలని రాజీనామా పత్రం ఫార్మాట్‌ను జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున పంపిస్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అంబాని, ఆదానిలకు లక్షల కోట్ల రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అప్పుల ఊబీలోనుంచి బయటకు తీసుకరావడానికి రుణమాఫీ చేసిందన్నారు. రుణమాఫీతో తెలంగాణలో 60 లక్షల మంది రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి పక్ష నాయకులుగా ప్రభుత్వం చేసిన మంచి పనులను చూసి హర్షించాలే తప్పా విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. భారతదేశ చరిత్రలో రైతు రుణమాఫీ సువర్ణ అక్షరాలతో లిఖింపదగ్గ కార్యక్రమమని గొప్పగా వివరించారు. రైతు బంధుకు, రైతు రుణమాఫీకి సంబంధం లేదని రైతు బంధు అనేది యాధావిధిగా అమలు అవుతుందన్నారు. రైతు రుణమాఫీని జీర్ణించుకోలేక కేటీఆర్ ఇష్టారీతిన విమర్శలు చేయడం అయన విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డుకు సంబంధం లేదని పట్టాదారు పాసు బుక్కు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫి వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్‌తో పాటు వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని వినతి

రాయికల్, జూలై 18: రాయికల్ పెద్ద పోచమ్మ గుడి ఎదుట నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ ధార్మిక సంఘాల సభ్యులు గురువారం తహసీల్దార్ ఖయ్యూంకు వినతి పత్రం సమర్పించారు. మూడు నెలలు గడిచినా అక్రమ నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ అక్రమ కట్టడంపై సత్వరమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యా దు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక సంఘాల సభ్యులు, కుల సంఘాల సభ్యులు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా గోరక్షక్ ప్రముఖ్ కాయితి గంగాధర్, ధర్మ జాగరణ సమితి మండల ప్రముఖ్ తిరుకోవెల సురేందర్, హిం దూ వాహిని పట్టణ ప్రముఖ్ కొత్తపెల్లి సంజీవ్, నాయకులు సామల సతీష్, కోల శంకర్, శ్రీ గద్దె సుమన్, పిన్నంశెట్టి వి నోద్, భరత్, రాజేశం, కిషన్, మదిరె నవీన్, ధార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ధార్మిక సంఘాల నాయకులు

ఘనంగా మొహర్రం వేడుకలు

జగిత్యాల టౌన్, జూలై 18: జిల్లా కేంద్రంలో గురువారం మొహర్రం వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. టవర్ ప్రాంతంలో కొలువుదీరిన పీర్లను చివరి రోజు భక్తులు భారిగా తరలివచ్చి దర్శించుకున్నారు. పట్టణంలో మార్కెట్ రోడ్, టవర్ నలుమూలల భక్తులతో కిటకిటలాడింది. అనంతరం పీర్లను టవర్, తీన్‌ఖని, మంచినీ బావి చౌరస్తాల మీదుగా ఊరేగింపు నిర్వహించి చింతకుంట చెరువులో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో గురువారం మొహ్రం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో పీరీలను ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పీరీల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు పులి వేశ ధారణలు వేసి మొక్కులను తీర్చుకున్నారు.

మల్యాల: మండలంలోని మల్యాల, పోతారంలో గురువారం మొహర్రం వేడుకలు జరిగాయి. గ్రామాల్లో పీరీలను ఊరేగించగా భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఊరేగింపు సందర్భంగా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురి అయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

పల్లె దవాఖానాల ఏర్పాటుతో మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, జూలై 18: పల్లె దవాఖానాల ఏర్పాటుతో గ్రా మీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని మైతాపూర్ గ్రామంలో ఎన్‌హెచ్‌ఎం నిధులు రూ.20 లక్షలతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా గురువారం పల్లె దవాఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.లక్షా 50 వేల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. అలాగే వనమ హోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. రాయికల్ పట్టణ గుడేటి రెడ్డి సంఘంలో రాయికల్ పట్టణ, మండలానికి చెందిన 66 మంది ఆడ బిడ్డలకు కల్యాణ లక్ష్మి, 116 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధి దారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైతాపూర్, రాయికల్ మండలంలో పలు గ్రామాల్లో నీటి కొరత లేకుండా తొంబర్రావుపేట వద్ద తూము ఏర్పాటుతో ఈ ప్రాంతం జలకళ సంతరించుకుందన్నారు. రాయికల్-రామాజీ పేట, రాయికల్-మైతాపూర్ మధ్య కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం వల్ల వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యం కలిగిందన్నారు. ఇటిక్యాల గ్రామానికి సైతం పల్లె దవాఖానా కావాలని ప్రజలు కోరుతున్నారని, ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ ఛైర్మన్ గండ్ర రమాదేవి, పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో, ఇన్‌ఛార్జి కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్ అనురాధ, కో ఆప్షన్ సభ్యులు సోహెల్, మహేంద్ర బాబు, జిల్లా వైద్యాధికారి సమియొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.



మైతాపూర్‌లో పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూలై 18: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన నాగపూరి సంతోష్ అనే గీత కార్మికుడు గురువారం తాటిచెట్టుపై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోజు వారి పనిలో భాగంగా సంతోష్ కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు జమ్మి కుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌గౌడ్‌కి భుజం విరిగి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

జీఎస్టీ అధికారుల అవగాహన

- భయంతో దుకాణాలు బంద్ చేసిన వ్యాపారులు



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి రజక్, సిబ్బంది

ముస్తాబాద్, జూలై 18: ముస్తాబాద్ మండల కేంద్రంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అధికారులు పలు వ్యాపార వాణిజ్య దుకాణాలకు అవగాహన కల్పించడం కోసం రాగానే గమనించిన వ్యాపారస్తులు దుకాణాలన్నీ బంద్ చేశారు. ముస్తాబాద్ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకణాల మూసివేతతో బంద్‌ను తలపించింది. జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారి రజక్ తన బృందంతో జీఎస్టీపై అవగాహన కల్పించేందుకు ముస్తాబాద్‌కు గురువారం వచ్చారు. జీఎస్టీ వలన కలిగే ఉపయోగాలను, ఉచితంగా జీఎస్టీ నమోదు చేయడం వంటి వివరాలను తెలియజేయ డానికి జీఎస్టీ నమోదు లేని దుకాణ యజమానులకు వివరించేందుకు వచ్చామని, నమోదుతో ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు.

గొలుసుకట్టు మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: జిల్లాలో గొలుసుకట్టు (చైన్)మార్కెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని పోలీసుశాఖ ప్రకటించింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సైబర్ సెల్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏదైనా కంపెనీ పేరుతో ముందుగా మీరు కొంత డబ్బులు కట్టి జాయిన్ అవ్వండని, ఆ తర్వాత అందులో మరో ముగ్గురిని జాయిన్ చేస్తే లైఫ్ లాంగ్ ఆదాయం ఉంటుందని చెప్పి మోసం చేస్తారని సైబర్‌సెల్ పేర్కొంది. ఏలి అండ్ లిల్లి యాప్, వేక్ యాప్, వియాక యాప్, గ్రోమో యాప్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ ట్రేడింగ్ అండ్ ఆన్‌లైన్ మల్టీలెవల్ మార్కెటింగ్ కంపెనీలో అత్యాశకు పోయి డబ్బులు పెట్టి మోసపోవద్దని వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ లేదా టెలిగ్రామ్ ద్వారా ఏ యాప్‌నైనా డౌన్‌లోడ్ చేసుకోమని చెప్తే చేసుకోవద్దని, వెబ్ సైట్‌ను నమ్మవద్దని, ఇదంతా మోసం అని గ్రహించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో మోసపూరిత ప్రకటనలు చూసి సొమ్మును అనాలోచితంగా అత్యాశకు పోయి గుర్తు తెలియని యాప్‌లో పెట్టి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దని, జాగ్రత్తగా ఉండాలని సైబర్ సెల్ వారు ఒక ప్రకటనలో తెలిపారు.

గంజాయి విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి

సిరిసిల్ల క్రైం, జూలై 18: మీ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారా... అయితే వెంటనే 8712656392 కు సమాచారం ఇవ్వండని పోలీసుశాఖ విస్తృత ప్రచారం చేపట్టింది. గురువారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఇందుకు సంబంధించిన లోగోను విడుదల చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఎవరైనా మత్తుపదార్థాలను (గంజాయి) అమ్మినా, తాగినా, సాగుచేసినా వారి గురించి ఎవరైనా సమాచారం తెలిస్తే ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు శాఖ పేర్కొంది. మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రకటించింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గురువారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గే ట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,694 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 14.545 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 24.795 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 447 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 8.777 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.938 టీఎంసీల నీటిని అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

రెండు బైక్‌లు చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని అల్వాల రాజు, మొడుసు గౌరయ్యలకు చెందిన రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చోరీ చేశారని బాధితులు తెలిపారు. గ్రామంలోని రాజు, గౌరయ్యలు తమ బైక్‌లను బుధవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచారు. గురువారం ఉదయం చూసే సరికి వాహనాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఎతుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు రాజు, గౌరయ్య తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



















కుక్క దాడిలో మున్సిపల్ సిబ్బందికి గాయాలు

హుజూరాబాద్, జూలై 18: హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేసి సుమారు 40మందిని దాడి చేసి, గాయపరిచింది. గురువారం హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పిచ్చికుక్క మున్సిపల్ సిబ్బందిపై విరుచుకు పడింది. దీంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో ఇన్‌చార్జీ సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కిషన్ రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, రమేశ్ పిచ్చి కుక్క కనబడగా పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా కుక్క ఆరెల్లి రమేశ్‌ను గాయపరిచింది. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది డాగ్ స్కాచ్‌ను పిలిపించి కుక్కను హతమార్చరు. కాగా గాంధీనగర్ నుంచి విధులకు వస్తున్న భాగ్యను కూడా తీవ్రంగా గాయపర్చగా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ వీధి కుక్కల బారిన ప్రజలు పడకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.


కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన భాగ్య

బాలుడిపై శునకం దాడి

ఓదెల, జూలై 18 : మండలంలోని గూడెంలో గురువారం కొమ్ము మోక్షిత్ అనే బాలుడిపై శునకం దాడి చేసింది. జమ్మికుంటకు చెందిన మోక్షిత్ ఇటీవల తన అమ్మమ్మ గ్రామమైన గూడెంకు రాగా, దారి వెంట వెళ్తున్న క్రమంలో కుక్కలు దాడి చేయడంతో చెంపకు రెండు చోట్ల గాయాలయ్యాయి. అక్కడున్న వారు మోక్షిత్‌ను రక్షించారు. దీంతో కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 18: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గాజుల పర్శరాములు (43) అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెంది జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు కొంత దూరంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పర్శరాములు భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ. కోటి అప్పు చేసి పరారీ..బాధితుల ఆందోళన

మెట్‌పల్లి రూరల్, జూలై 18: ఎక్స్‌కావేటర్ యజమాని సుమారు కోటికి పైగా అప్పు చేసి పరారైన సంఘటన మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గసాగర్ గ్రామానికి చెందిన పెంట మహిపాల్ తనకున్న ఎక్స్‌కావేటర్ కిరాయికి నడుపుతూ ఉండేవాడు. ఊర్లో అందరితో పరిచయాలు పెంచుకున్నాడు. అత్యవసరం ఉందని కొంత మంది వద్ద వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఉన్న ఊరు వ్యక్తే కదా అనుకుని అప్పు ఇచ్చిన వారు కూడా ఎలాంటి పత్రం లేకుండా గుడ్డిగా నమ్మి అడినంగా ఇచ్చుకుంటు పోయారు. ఇవే కాకుండా తెలిసిన వృద్ధులు దాచుకున్న పింఛన్ డబ్బులతో పొదుపు చేసుకున్న మహిళలు, కూలీ నాలి చేసుకునే వారిని వదల కుండా మహిపాల్ అప్పులు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వమంటే ఏదో సాకు చెప్పుకుంటూ కాలం వెళ్లదీసాడు. సుమారు కోటి రూపాయల వరకు అప్పు చేయడంతో అప్పు ఇచ్చిన వారు డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చేశారు. అప్పు తీర్చే దారి లేక కుటుంబ సభ్యులతో కలిసి పారియాడు. గురువారం ఇంటికి బాధితులు వెళ్లి చూసేసరికి ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ వాపోతున్నారు. గ్రామాల్లో పలువురు వద్ద లక్షల రూపాలయలు అప్పుగా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.


వ్యాపారి ఇంటి ఎదుట గుమికూడిన బాధితులు

యువకుడి బలవన్మరణం

కమాన్‌పూర్, జూలై 18: మండల కేంద్రంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం.. కమాన్‌పూర్ గ్రామానికి చెందిన రెడ్డి అభిలాష్(20) డిప్లోమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొద్దీ రోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిఖనిలోని ఫైట్టింక్లయిన్ కాలనీలో ఉంటు న్నాడు. గురువారం స్వగ్రామంలోని ఇంటికి వచ్చి ఉరేసు కొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రెడ్డి స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.


అభిలాష్(ఫైల్)

కూతురితో ప్రేమను వదులుకోవాలని హత్యాయత్నం

- యువకుడు లేకపోవడంతో తండ్రిపై దాడి

- దాడికి పాల్పడిన ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నీలం రవి

మల్యాల, జూలై 18: తన కూతురితో ప్రేమ వ్యవహారం మానుకోవాలని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో అమ్మాయి తండ్రితో పాటు బాబాయి యువకుడి ఇంటిపై దాడికి వెళ్లారు. కానీ అక్కడ యువకుడు అందుబాటులో లేకపో వడంతో అతడి తండ్రి పై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరినీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మల్యాల సీఐ నీలం రవి తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాడంపల్లికి చెందిన గుర్రం చిన్నమల్లయ్య కొడుకు రాజ్‌కుమార్ ఇదే గ్రామానికి చెందిన బాసవేని గంగాధర్ కూతురు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తన బిడ్డతో ప్రేమ విషయం మరచిపొమ్మని బాసవేని గంగాధర్, అతని తమ్ముడు అంజి పలుమార్లు రాజ్‌కుమార్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ ప్రేమ వ్యవహారం కొనసాగుతుం డడంతో రాజ్‌కుమార్‌ను చంపాలని నిర్ణయించుకున్న గంగాధర్, అంజి ఈ నెల 14న రాత్రి రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ఇంట్లో రాజ్‌కుమార్ లేకపోవడంతో అతని తండ్రి గుర్రం చిన్నమల్లయ్యపై అంజి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి పారిపోయారు. దీంతో గుర్రం రాజ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్ కేసు నమోదు చేశారు. గురువారం అంజి, గంగాధర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

- కరీంనగర్‌కు చెందిన వ్యక్తి భూపాల్‌పల్లిలో అరెస్టు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 18: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తిని, అతనికి సహకరించిన మరో ఇద్దరిని భూపాలపల్లి పోలీసలు కటకటాల్లోకి పంపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే గురువారం భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌రావు.. భూపాలపల్లి కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో సెక్యూరిటీ గార్డు, స్వీపర్ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయుటకు కాంట్రాక్టు తనకే వస్తుందని నమ్మబలికాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులు, ఆశావాహుల నుంచి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వసూలు చేశాడు. కొంత మందికి జాబ్ కల్పించినట్లుగా డ్యూటీలు చేయించి జీతాలు ఇవ్వకుండా తప్పించుకుని తిరిగేసరికి శ్రీనివాసరావుపై కొంత మందికి అనుమానం కలిగింది. ఇతనికి మరో ఇద్దరు సహకారం అందించారు. నిందితులైన ఆముగ్గురిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకొన్నారు. ఈ మేరకు డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించడంతో గురువారం శ్రీనివాసరావు, సుభాష్, అశోక్‌లను రిమాండ్‌కు పంపించారు.

సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం

» గిరిజన వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి » జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్


మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

సిరిసిల్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లతో కలిసి సమీక్షించారు. జిల్లాకు వచ్చిన హుస్సేన్‌కు కలెక్టర్, ఎస్పీ అధికారులు ఘనంగా స్వాగతించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమం కోసం కమిషన్ పనిచేస్తోందని చెప్పారు. గిరిజనులకు ఇబ్బందులు కలిగిస్తే ఎంతవా రినైనా శిక్షించే అధికారం కమిషన్‌కు ఉందన్నారు. ప్రజాసమస్యలను సంబంధిత అధికారులు గ్రామ స్థాయిలో మండల స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. కమిషన్ ప్రతీ మూడు నెలలకు ఒకసారి క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తుందని అన్నారు. దేశ వ్యాప్తంగా వ్యక్తిగతంగా పర్యటిస్తూ గిరిజనుల జీవితాల్లో పురోగతిని కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల స్థితిగతులపై సమీక్షిస్తూ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కిందిస్థాయిలోనే చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేయాలన్నారు. గిరిజనులు అధికంగా ఉన్న గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, అవసరమైన శిక్షణలు గ్రామీణ యోజన పథకం కింద చేపట్టాలని చెప్పారు. గిరిజనులకు హక్కుగా రావాల్సిన పోడు పట్టా భూములు అర్హత మేరకు పకడ్బందీగా సర్వే నిర్వహించి పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

సిరిసిల్ల టౌన్, జూలై 18: గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. 2019 నుంచి గ్రామాల అభివృద్ధి పనులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇవ్వడంతో అప్పటి సర్పంచ్‌లు లక్షల రూపాయలు అప్పులు తీసుకొచ్చి గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగించారని అన్నారు. గ్రామాలు అభివృద్ధి కోసం సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాక కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యకు పాల్పడ్డారాని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు సర్పంచ్‌లు బిల్లులు రాక అప్పులకు వడ్డీలు కడుతూ ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దని వెంటనే గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లును చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సర్పంచ్‌ల బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటుం దని హెచ్చరించారు. సమా వేశంలో తెలంగాణ మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాలకర్ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపనూరి మల్లేశంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవుని సుజాతనర్సయ్య, జిల్లా కార్యదర్శి నారాయణ, నియోజకవర్గం అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, వేముల వాడ మండల అధ్యక్షుడు దొంతి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య

గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై18: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం తుది గడువని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www. tgbcstudy-circle. cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 75 రోజులపాటు నిర్వహించే శిక్షణ ఈనెల 22న మొదలవుతుందని పేర్కొన్నారు. అభ్య ర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్ష లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజే స్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లో ని టీజీ బీసీ స్టడీసర్కిల్‌లో, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీసర్కి ల్‌లలో ఇస్తారన్నారు. సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

ముస్తాబాద్, జూలై 18: సౌదీ అరేబియాలో గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి మృతదేహం గురువారం ఇంటికి చేరుకోవడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. మండలంలోని వెంకయ్యకుంటకు చెందిన పిట్ల మహేశ్(45) 15 ఏళ్లుగా సౌదీ అరేబియాలో అల్ జమీల్ కంపెనీలో కులీగా పనిచేస్తున్నాడు, ఈనెల 4వతేదీన గుండెపోటు రావడంతో చనిపోయడాని కుటుంబీకులు తెలిపారు. సౌదీ నుంచి మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సుమారు ఐదు లక్షల రూపాయల వరకు అప్పు ఉందని తెలిపారు. తల్లి మల్ల వ్వ, భార్య కావ్య, కుతూరు నేహ, కొడుకు నవనీత్‌లున్నారు. తెలంగాణా ఎన్ఆర్ఐ డిపార్ట్‌మెంట్ ఇన్ చార్జ్ చిట్టి బాబు, జనగామ శ్రీనివాస్ మృతదేహం హైదరాబాద్ నుంచి స్వగ్రామం రావడం కోసం అంబు లెన్స్‌లో ఏర్పాటు చేశారు. మృతుడి కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారుల తనిఖీలు

జగిత్యాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో గురువారం సివిల్ సప్లయి అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయి శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయి అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్ మిల్లుల్లో దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా...లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని మూడు చోట్ల సోదాలు జరిగాయి. వెల్గటూరు మండలం అంబారిపేటలో గల శ్రీరామ ఇండస్ట్రీస్, రాయికల్ మండలం మైతాపూర్‌లో గల శివమణి ఇండస్ట్రీస్, కోరుట్ల మండలం జోగినిపల్లిలో గల ఎస్ఎల్ఎన్ఎస్ పారాబాయిల్డ్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపా రు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, కరీంనగర్ డీఎస్‌వో సురేశ్ రెడ్డి, అధికారులు ప్రభాకర్, లక్ష్మారెడ్డి, పుల్లయ్యలతో పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌వోలు, డీఎంలు విస్తృతంగా సోదాలు నిర్వహించడం రైస్ మిల్లు వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.


శ్రీరామ ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయి అధికారులు

అరెస్టు నుంచి తప్పించుకోవడానికి యువకుడి ఆత్మహత్యాయత్నం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, జూలై 18: అరెస్టు నుంచి తప్పించుకోవడానికే అఖిల్ అనే యువకుడు భయభ్రాం తులను గురిచేయడం కోసం బ్లేడ్‌తో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మందిపై నమోదైన గంజాయి కేసులో చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ నిందితుడిగా ఉన్నాడు. వీరిలో అమీర్, కాల్వ వెంకటేష్, పండుగ అభి, రవిని విచారించగా వారందరికీ తోట అఖిల్ గంజాయిని సప్లయ్ చేసేవాడని తెలిసిందన్నారు. దీంతో అఖిల్‌ను చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన అనంతరం వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించగా వారు తీసుకుపోయే క్రమంలో అప్పటికే తన అన్న రాకేష్ ద్వారా ఒక పథకం ప్రకారం భయభ్రాంతులు గురిచేయాలనే ఉద్దేశంతో బ్లేడు తెప్పించుకొని, అఖిల్ తన శరీరంపైన గాయాలు చేసుకున్నాడన్నారు. ఈ క్రమంలో సిబ్బంది వెంటనే అడ్డుకొని, అతనిని ఆస్పత్రిలో చికిత్స చేయించారని తెలిపారు. అనంతరం అఖిల్‌ను వేములవాడ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారన్నారు. ఈ సంఘటనలో కేవలం అరెస్టును తప్పించుకోవడానికి ఆడిన నాటకం అన్నారు. చట్ట ప్రకారం చేయవలసిన విధులలో పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అఖిల్ గంజాయికి, మద్యానికి బానిసై జల్సాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అరెస్ట్ చేసే సమయంలో పోలీసుల విధులకు ఆటంకం కల్పించడంతో చందుర్తిలో కేసు నమోదు చేశామని వివరించారు.

విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, జూలై 18: విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. బట్టలు ఆరవేసే దండెము జిఐ వైర్లపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లడం వలన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడంతో దండెములకు విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్లాస్టిక్ దండెములను ఉపయో గించాలని కోరారు. విద్యుత్ సరఫరా వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం, గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం వల్ల, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడటం వలన, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వినియోగదారులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

● ప్రమాదాల నివారణకు విద్యుత్‌శాఖ సూచనలు..

- రైతులు విద్యుత్ మోటార్లు, పైపులను, ఫుట్ వాల్వులను ఏమరుపాటుతో తాకకూడదు. వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్తింగ్ చేయాలి. ఎర్త్ చేయని మోటార్లు, స్టార్టర్లు, పైపులు, ఫుట్ వాల్వులు తాకడం అత్యంత ప్రమాదకరం. రైతులు, వినియోగదారులు స్వయంగా సొంతంగా విద్యుత్ పనులు చేసుకోకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో పనులు చేసుకోవాలి. పశువులను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకా లంలో స్తంభాలు తడిగా ఉండటం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- ఇంటి వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులు, సెల్‌ఫోన్ చార్జర్‌ను ఉపయోగించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌ల ఆపరేట్, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరం.
- కరెంటు లైన్ల కింద పందిరిలు వేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలను అమర్చి చేపలను పట్టడం వలన షాక్ గురయ్యే అవకాశం ఉంది. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. బోర్లు వేసేటపుడు, జెండా ఎగుర వేయునపుడు పైపులు వైర్లకు తాకకుండా జాగ్రత్త వహించాలి. సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడటం వలన షాక్‌కు గురై చనిపోతున్నారు. చార్జింగ్ వైరు తీసి ఫోన్ మాట్లాడాలి. పొలాలకు విద్యుత్ కంచెలు వేయరాదు.
- వర్షాలు కురిసినప్పుడు తడిసిన విద్యుత్ స్తంబాల స్టేవైరు/సపోర్టు వైరును, తడిచిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదు. ఇలాంటివి గమనించిన వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలుపాలి.
- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని ముట్టుకోరాదు. అతడిని రక్షించడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వాడాలి.

ఎక్సైజ్ సీఐకి ప్రశంసాపత్రం

- గంజాయి సాగు నియంత్రణలో కీలక పాత్ర

జగిత్యాల టౌన్, జూలై 18: గంజాయి సాగు నియంత్రణలో ఎక్సైజ్ సీఐ కీలకంగా వ్యవహరించి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.. జగిత్యాల డివిజన్‌లో ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న సర్వేశ్వర్ గతంలో ఖమ్మం డివిజన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా విధులు నిర్వహించాడు. గంజాయి సాగుతో పాటు వాటి మూలాలను గుర్తించి 120 కేసుల్లో 4,630 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయిలోనే ఖమ్మం సీఐ గంజాయి నిర్మూలనలో మొదటి స్థానంలో నిలిచాడు. సీఐ సర్వేశ్వర్ ప్రతిభను గుర్తించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలహాసన్ రెడ్డి ప్రశంసాపత్రాన్ని జారీ చేశారు. ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌ల చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన జగిత్యాల సీఐ సర్వేశ్వర్‌ను గురువారం జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణతో పాటు పలువురు అభినందించారు.


ప్రశంసా పత్రం అందుకుంటున్న సర్వేశ్వర్

డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

ఎల్లారెడ్డిపేట, జూలై 18: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని బొప్పాపూర్ గ్రామానికి చెందిన వేముల బాలు (35) అనే యువకుడు గురువారం రాత్రి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బాలు ఇటీవల గల్ఫ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దాంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని పోలీసులు వివరించారు. బాలుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.


బాలు(ఫైల్)

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, జూలై 18: నేరాల నియంత్రణనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోందని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీ, దొమ్మరి వాడలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మట్లాడుతూ ప్రజల రక్షణ గురించి, సమస్యలు నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామంలో, కాలనీలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందన్నారు. నేరరహిత గ్రామాలుగా చేయలనే ఉద్దేశంతోనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలను, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో గంజాయికి సంబంధించిన సమాచారం ఉంటే అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచతామన్నారు. ఈ సందర్బంగా గ్రామంలో సరైన ధ్రువపత్రాలు లేని, నంబర్ ప్లేట్స్ లేని 15 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా వారి యొక్క వాహనాలకు ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల్లో, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐలు సుధాకర్, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



యువతకు కౌన్సెలింగ్ చేస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

కొడిమ్యాల, జూలై 18: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తురకకాశీనగర్ గ్రామాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది సర్వే చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. వర్షాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల వలన జలుబు, జ్వరం, దగ్గువంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దోమల వలన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయని, వ్యాధులకు కారణమైన దోమలను వ్యాప్తి చెందకుండా ఎవరికి వారే ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి పరమేశ్వరి, డీపీవో స్వామి, సీహెచ్‌వో రాజశేఖర్, ఏఎంవో సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ అలివేలు, ఎంఎల్‌హెచ్‌పీ ఉదయ్, హెల్త్ అసిస్టెంట్లు విష్ణువర్ధన్, సుదర్శన్, ఏఎన్‌ఎంలు రజిత, లక్ష్మీకాంత, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కోరుట్ల రూరల్, జూలై 18: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణరావు గురువారం పరిశిలించారు. పట్టణ అనుబంధ గ్రామమైన ఎకిన్‌పూర్‌లో బేతాళ స్వామి ఆలయం వద్ద బోరుబావి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషి చేసిన కృష్ణరావును ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో జువ్వాడి కృష్ణరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెరుమాండ్ల సత్యనారాయణగౌడ్, నాయకులు నయీం, మహిపాల్, అజయ్ పాల్గొన్నారు.

సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలి

రాయికల్, జూలై 18: రాయికల్ పట్టణంలో గుడేటి రెడ్డి సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గుడేటి రెడ్డి సంఘం సభ్యులు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గుడేటి రెడ్డి సంఘ భవనంలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు కాగా ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అలాగే అల్లూరి సీతారామరాజు బొమ్మ నుంచి రాయికల్ మార్కెట్ యార్డు వరకు విద్యుత్‌దీపాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుడేటి రెడ్డి సంఘం అధ్యక్షుడు కాకరి రాజేందర్ రెడ్డి, కోశాధికారి వెలమ నరేందర్ రెడ్డ, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

'మాస్ట్రో'లో మెహందీ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

కోరుట్ల, జూలై 18: ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని మాస్ట్రో కాలేజ్‌లో విద్యార్థినులు మెహందీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంస్కృతి సంప్రదాయలు ప్రతిబింబించేలా గోరింటాకులు అందంగా అలంకరించుకున్నారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ ఆకుల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గొల్లపల్లి, జూలై 18: మండలంలోని రాఘవపట్నంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రుద్రవేణి తిరుపతి కుటుంబానికి రాఘవ పట్నం, గంగాదేవి పల్లె గ్రామానికి చెందిన పలువురు దాతలు ఇచ్చిన రూ. 51,200 ఆర్థిక సాయంను తాజామాజీ ప్రజాప్రతినిధులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో తాజామాజీ ప్రజాప్రతినిధులు రాగం శంకరయ్య, ఒడ్నాల అంజయ్య, సింగిరెడ్డి మధుకర్‌రెడ్డి, బలుసాని సుజాతరాజ్ కుమార్, కాసాని చంద్రశేఖర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొలగాని జలేందర్, కార్యదర్శి కాళ్ల రమేష్, నాయకులు మహేష్ గౌడ్, మనోహర్, అశోక్ పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



చిన్నారుల పేర్లను నమోదు చేసుకుంటున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

గొల్లపల్లి, జూలై 18: పూర్వ ప్రాథమిక విద్యకు చక్కటి వేదికలు అంగన్‌వాడీ కేంద్రాలని సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. గురువారం గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్మ మాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ రెండున్నరేళ్ల వయస్సు దాటిన చిన్నారులను గుర్తించి, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో తాండ్ర రమాసత్యప్రమోదర్, చిప్ప రాధ, తదితర అంగన్‌వాడీ టీచర్లతో పాటు చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల సందేశాలకు స్పందించవద్దు

మెట్‌పల్లి, జూలై 18: సెల్ ఫోన్‌ల ద్వారా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలకు స్పందించవద్దని, సైబర్ నేరాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చిరంజీవి అన్నారు. గురువారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు వాట్సాప్‌లో ఏదో బ్యాంక్ పేరిట ప్రొఫైల్, బ్యాంక్ పిక్చర్, లోగోతో కూడిన యాప్‌లో ఏపీకే ఫైల్స్‌ను పంపిస్తున్నారన్నారు. వాటిని యాక్సెప్ట్ చేయగానే వాట్సాప్ యాప్ వారి కంట్రోల్‌కి వెళ్లిపోతుందన్నారు. దీంతో సైబర్ నేరస్థులు గూగుల్ పే, ఫోన్ పే మరియు యూపీఐ ద్వారా డబ్బులు దోచుకుంటారన్నారు. బయటి వ్యక్తులతో మన వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్ బారిన పడినప్పుడు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ధర్మపురి వాసికి పీహెచ్‌డీ పట్టా



జక్కు ప్రసన్న

ధర్మపురి, జూలై 18: ధర్మపురి పట్టణానికి చెందిన జక్కు ప్రసన్న కోయంబత్తూర్‌లోని తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా తీసుకుంది. స్థానిక ఆర్యవైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్-శ్రీదేవి కూ తురు ప్రసన్న అగ్రికల్చరల్ యూనివర్శిటీలో అగ్రికల్చరల్ పీహెచ్‌డీ అగ్రోనా మి సబ్జెక్ట్‌లో పీడీసీ తీసుకుంది. పీహెచ్‌డీలో తనకు గ్రేడ్ చేసి, గైడ్ చేసిన మారి ముత్తుకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రస న్నను పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఆర్యవైశ్య సంఘా ల ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

మొక్కలు పంపిణీ చేసిన 'జువ్వాడి'

కోరుట్ల, జూలై 18 : పట్టణంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు వన మహోత్సవంలో భాగంగా గురువారం మొక్కలు పంపిణీ చేశారు. 15వ వార్డు భీమునిదుబ్బ ప్రాంతంలో పలువురికి మొక్కలు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్ ఆడెపు కమల, తిరుమల గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కోరుట్ల, జూలై 18: పట్టణంలోని సాయిరామ సన్నిధిలో గురువారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అర్చనలు, అభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

అంబరాన్నంటిన రుణమాఫీ సంబరాలు

● జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తల బైక్ ర్యాలీలు.. ● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు ● హర్షం వ్యక్తం చేసిన అన్నదాతలు



రైతులతో కలిసి సీఎం ప్రసంగాన్ని వింటున్న ఎమ్మెల్సీ



మేడిపల్లిలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ చూస్తున్న కలెక్టర్



వెల్గటూర్‌లో మాట్లాడుతున్న విప్ అడ్లూరి

రాయికల్, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి చర్యలు తీసుకోవడం పట్ల రైతుల మొహాల్లో ఎనలేని సంతోషం కనబడుతుందని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయడంతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శ రాష్ట్రమైందని చెప్పారు. రాయికల్ మండలం అల్లీపూర్ రైతు వేదికలో గురువారం రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో ముక్తీశ్వర్, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం, తాజా మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రమేష్, నాయకులు గోపి రాజరెడ్డి, ప్రసాద్, సాయి రెడ్డి పాల్గొన్నారు.

కథలాపూర్: ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేసిన నేపథ్యంలో గురువారం కథలాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ నుంచి రైతు వేదిక వద్ద ర్యాలీగా వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతువేదికలో సీఎం రుణమాఫీకి సంబంధించిన కార్యక్రమాన్ని వెబ్ కాస్టింగ్ ద్వారా వీక్షించారు. పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, లింగంగౌడ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : జగిత్యాల మండలం తిప్పన్నపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మహేష్, బండారి మధు, బోగు సతీష్, మ్యాడరెడ్డి, భోదనపు చందు, రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల కేంద్రంలో గల రైతు వేదికలో రైతు రుణమాఫీ సంబరాలను నిర్వహించారు. ఈ మేరకు రైతులు అధికారులు సంబరాల్లో పాల్గొన్ని ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ ఎలేటి నర్సింహారెడ్డి, రైతులు సత్యనారాయణరెడ్డి, రామరావు, బేర మహేష్, వ్యవసాయ, సహకార సంఘం అధికారులు వెంకటేష్, ఆంజనేయులు, శివ, వరుణ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: రైతు రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయడంతో నాయకులు పట్టణంలో సంబరాలు జరిపారు. గురువారం పట్టణంలోని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు ఆదేశాల మేరకు కార్యలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాకిటి సత్యంరెడ్డి, కూన గోవర్ధన్, కుతుబ్‌పాషా, రుత్త నారాయణ, అందె మారుతి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు రుణమాఫీ అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులకు తెలియజేయాలని ఉన్నత ఆదేశాల మేరకు మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఏవో షాహిద్‌అలీ టీవీని ఏర్పాటు చేశారు. గురువారం రైతులతో సంబరాలు జరిపిన అనంతరం సీఎం ప్రసంగాన్ని తిలకించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో ని ప్రధాన కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని రైతువేదిక ఆవదరణలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రుణమాఫీ సంబరాలు జరిపారు. శ్రావణ మాధ్యం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించి, లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం రైతులు, నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో లావణ్య, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులతో కలసి మండల కేంద్రంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలిలలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, జిల్లా ఉపా ధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : మండలంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేసుకున్న సంబరాలు గురువారం అంబరాన్నంటాయి. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రుణ మాఫీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. రైతువేదిక వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సందేశాలను రైతులకు వినిపించారు. యూత్ మండల శాఖ అధ్యక్షుడు తిరుపతి, తా జా మాజీ ప్రజా ప్రతినిధులు గంగాధర్, సత్యానారాయణ, ధనవ్వలక్ష్మన్, పద్మ వెంకటేశం, రాజ్యలక్ష్మీతిరుపతిరెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని కాంగ్రెస్ సినియర్ నాయకులు జువ్వాడి కృష్ణరావు అన్నారు. గురువారం మండలంలోని ఐలాపూర్ గ్రామంలో రైతువేదికలో నిర్వహించిన రుణమాఫీ సంబరాలలో ఆయన పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సినియర్ నాయకులు జువ్వాడి కృష్ణరావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారయ ణగౌడ్, కాంగ్రెస్ నాయకులు కొంతం రాజు, గుగ్గిల సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

మేడిపల్లి: ప్రభుత్వం రైతు రుణమాఫీ కార్యక్రమం రైతు నేస్తను మండలంలోని రైతులు ఘనంగా జరుపుకున్నారు. మేడిపల్లి రైతు వేదికలో సీఎం రైతు రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో అనంద్‌కుమార్, డీఏవో వాణి , తహసీల్దారు కిరణ్‌కుమార్, ఏవో, ఏఈవోలు రైతులు నరేష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగరాజు, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు రుణమాఫీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రైతులు బాణసంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సినియర్ నాయకులు జువ్వాడి కృష్ణరావుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాములు, దీపక్‌రాజ్, రాజన్న, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మల్యాల: మండల వ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్ నాయకులు పంట రుణమాఫీ సంబరాలు జరిపారు. మల్యాల, ఓగులాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు బ్లాక్‌చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. మల్యాల రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొని సీఎం ప్రసంగం వీక్షించారు. మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ నాయకులు ఆనంద రెడ్డి, ఆదిరెడ్డి, శోభరాణీ, రాంలింగారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, లక్ష్మనాచారీ, మ్యాక లక్ష్మన్, నరసింహరెడ్డి పాల్గొన్నారు

వెల్గటూర్: అన్నం పెట్టే రైతులను అప్పుల ఊబి నుండి ఆశల సాగు వైపు నడిపించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణ మాఫీ పథకం అమలు చేసిందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కుమ్మరిపల్లి రైతు వేదికలో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు రుణ మాఫీ సంబరాలు నిర్వహించారు. రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల వ్యవసాయాధికారి కరుణ, వెల్గటూర్, ఎండపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు రాంరెడ్డి, రత్నాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మహంకాళి రాజన్న, బీర్‌పూర్ సింగిలివిండో చైర్మన్ ముప్పాల రాంచందర్ రావ్, కొల్వాయి సింగిలివిండో చైర్మన్ నవీన్‌రావ్, మండల వ్యవసాయ అధికారి అనూష, ఏఈవోలు సందీప్, శిరీష పాల్గొన్నారు.

కొడిమ్యాల: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం పట్ల కొడిమ్యాల మండల కేంద్రంలో గురువారం సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు నారాయణ గౌడ్, ప్రసాద్, మల్లారెడ్డి, జీవన్ రెడ్డి, మల్లేశం యాదవ్, రవి, ప్రభాకర్ రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ : దేశానికి వెన్నముక రైతు అని ఆ రైతు సంతోషమే ప్రభుత్వ సంతోషమని ఎన్నికల్లో ఇచ్చిన హామీ తప్పకుండా సీఎం రేవంత్ రెడ్డి ఏక కాలంలో రైతు రుణమాఫీ చేశారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. అంబారిపేట రైతు వేదికలో గురువారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే అడిషనల్ కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. ఏవో వినీల, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంపీవో సలీం, ఏఇవో నాగరాజు, టీపీ దయాకర్, రైతులు పాల్గొన్నారు.

జగిత్యాల మండలం తిప్పన్నపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు మహేష్, మధు, సతీష్ ఉన్నారు.



మెట్‌పల్లిలో క్షీరాభిషేకం..



అంబారిపేటలో సీఎం ప్రసంగం వింటున్న ఎమ్మెల్యే



మల్యాలలో సీఎం చిత్రపటంకు క్షీరాభిషేకం



గొల్లపల్లిలో కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం

జీవకోటి మనుగడకు మొక్కలు నాటాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జూలై, 18 : సమస్త జీవ కోటి మనుగడ కోసం చెట్లను నాటి సంరక్షించాలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కుప్‌సింగ్ పార్కులో నాయకులతో కలిసి మొక్కను నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు పర్యవరణంతో ఇబ్బందులు రాకుండా ఉండాలంటే మనిషికి ఒక్క మొక్క నాటడంతో పాటు సంరక్షిస్తూ పెంపకాల బాధ్యతను తీసుకోవాలన్నారు. పట్టణం, గ్రామాల్లోని రహదారుల వెంటా గాలి, నీడనిచ్చే చెట్లతో పాటు వేప, పండ్ల చెట్లు పెంచాలి, ప్రజల మనుగడకు చెట్లు ఉండాల్సిన అవసరం ఉన్నందున ప్రభుత్వ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటే సందర్భంలో విద్యుత్ వైర్ల కింద నాటకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల వెంబడి నాటే మొక్కల విషయంలో విద్యుత్ వైర్లకు ఇబ్బందులు లేకుండా పూల మొక్కలు, వైర్లు లేని ప్రదేశాల్లో మంచి గాలినిచ్చే చెట్లకు సంబంధించిన మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, కమిషనర్ మోహన్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో మొక్కకు నీరు పోస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా..

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చేస్తానని కోరట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు ఎల్‌వోసీ చెక్కులను గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే అరకొర పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజే సేందుకు కృషి చేస్తానని, నియోజక అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పోరాటం చేస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభివృద్ధికి కృషి చేసి ప్రజల మనసు గెలుచుకోవాలి, కానీ తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ ప్రజలను మోసం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట ధర్నా



ఎమ్మెల్యే అడ్లూరికి వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

ధర్మపురి, జూలై 18: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశావర్కర్స్ గురువారం ధర్నా నిర్వహించారు. ఆఫీస్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆశావ ర్కర్స్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది చేరుకుని ఆందోళన విరమించాలని నచ్చ జెప్పారు. అనంతరం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్స్ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెవెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆశావర్కర్స్ నుంచి ఆయన వినతి పత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో గల అన్ని మండలాలకు చెందిన ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

మెట్‌పల్లి : ఏళ్ల తరబడి నుంచి వెట్టి చాకిరి చేస్తున్న ఆశాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ సంజయ్‌కు వినతి పత్రం అందజేసి సమస్యలను పరిష్కారించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18వేలు, ఇన్సూరెన్స్ రూ. 50లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. ప్రతి సంవత్సరం 20రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, ఆరు నెలలు వేతనంతో కూడిన మెడికల్ సెలవు ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల జరిగినప్పటి నుంచి అనేక సార్లు ఆరోగ్య శాఖ మంత్రి, అధికారులను కోరామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఆశాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ల అధ్యక్షురాలు ఆత్మకూరి లత, కార్యదర్శి మమత, సహకార్యదర్శి దివ్య, ఉపాధ్యక్షురాలు బద్ది పద్మ, సహాపాధ్యక్షురాలు వనిత, సభ్యులు పాల్గొన్నారు.

నేడు అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కోరుట్ల, జూలై 18 : ఈ నెల 19న కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల డిపోల నుంచి అరుణాచల దివ్యక్షేత్రంకు ప్రత్యేక బస్సులు నడుతున్నట్టు డిపో మేనేజర్ తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు. రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కూడా ఉందని ఒక్కొక్కరికి ఛార్జీ రు. 4800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రాయికల్, జూలై 18: పట్టణానికి చెందిన బావునగిరు భీమయ్య సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో రాయికల్ పోలీసులను సంప్రదించాడు. సీఈఐఆర్ అప్లికేషన్ సహాయంతో రాయికల్ పోలీసులు దానిని పట్టుకోగా, గురువారం ఎస్సై అశోక్ ఫోన్‌ను భీమయ్యకు అందజేశారు.

ఘనంగా వన మహోత్సవం

రాయికల్, జూలై 18: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గురువారం 75వ వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి చిరంజీవి, కార్యదర్శి రాజేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వీవోఏలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

మల్యాల, జూలై 18: మూడేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలంటూ ఐసీడీఎస్ అధ్వర్యంలో గురువారం మండలంలోని ముత్యంపేటలో ర్యాలీ నిర్వహించారు. ప్రీ స్కూల్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. ఆట, పాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో సూపర్‌వైజర్ పవిత్ర, అంగన్‌వాడీ టీచర్లు టీ.శోభరాణీ, దారం గంగ, గడ్డం శారధ, కె.శారధ, పద్మ, మమత ఉపాధ్యాయులు రాజయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

వర్షాల కోసం ప్రత్యేక పూజలు

మెట్‌పల్లి రూరల్, జూలై, 18 : వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని బండలింగాపూర్ గ్రామాభి వృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పురోహితుడు శ్రీవర్ధన్ ప్రత్యేక పూజలు చేయించారు. లోక క్షేమార్థం ఏటా నిర్వహించే గోపాల కాలువల కార్యక్రాన్ని గురువారం జరిపారు. గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని వీధుల వెంటా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలోని చెరువులో ప్రత్యేక పూజలను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులచే జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెప్పాల రాజాం, సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.